


# కెరటం న్యూస్
(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 269 | ఆదివారం 26- అక్టోబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## హిట్ అండ్ రన్ కేసు.. బిగ్‌బాస్ బ్యూటీపై కేసు



## సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించిన చిరంజీవి..

30 మందికి నోటీసులు



## భారత్‌లో బయటపడ్డ మరో బంగారు గని..



# మున్సిపాలిటీలకు భారీ నజరానా..

## రూ.2780 కోట్లు విడుదల చేసిన తెలంగాణ సర్కార్!



- మున్సిపాలిటీల అభివృద్ధికి భారీ నిధులు
- 138 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 2432 పనులకు ఆమోదం..
- "తెలంగాణ రైజింగ్ విజన్ 2027"లో భాగం
- పనుల గడువు- 2026 మార్చి వరకు
- కొత్త మున్సిపాలిటీలు, కొత్త గ్రామాలు విలీనమైన మున్సిపాలిటీల్లో పనులకు ప్రాధాన్యం

**న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు తెలంగాణ ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు మంజూరు చేసింది. రాష్ట్రంలోని 138 మున్సిపాలిటీలకు రూ.2780 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ కోర్ అర్బన్ సిటీని మినహాయించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు వెంటనే నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ శాఖ ఈ నిధులు మంజూరు చేసింది. తెలంగాణ రైజింగ్ విజన్ 2027లో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ తో పాటు రాష్ట్రమంతటా ఉన్న పట్టణాలను గ్రోత్ హబ్ లుగా తీర్చిదిద్దాలని సీఎం ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు తెలిపారు. అలాగే, ఇప్పటికే ఉన్న మున్సిపాలిటీల విస్తరణతో పాటు కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలన్నింటా మెరుగైన పౌర సదుపాయాలతో పాటు పెరుగుతున్న డిమాండ్ ను అందుకునేలా అభివృద్ధి పనులు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

అలాగే, మున్సిపల్ శాఖ ఇచ్చిన ప్రతిపాదనల మేరకు రాష్ట్రంలోని 138 మున్సిపాలిటీల్లో రూ. 2,780 కోట్ల ఖర్చుతో 2,432 పనులు చేపట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ లో పొందుపరిచిన నగరాభివృద్ధి నిధులతో పాటు అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవెలప్మెంట్ ఫండ్ (యూఐడిఎఫ్) పథకాల నుంచి ఈ నిధులను మంజూరు చేసినట్లు ప్రకటించారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలకు రూ.15 కోట్లు, అదనంగా గ్రామ పంచాయతీలు విలీనమైన మున్సిపాలిటీలకు రూ. 20 కోట్లు, పాత మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున నిధులు రిలీజ్ చేశారు. కొత్తగా ఏర్పడిన మున్సిపల్ కార్పొరేషన్లకు రూ. 30 కోట్లు మంజూరు చేయగా.. ప్రాధాన్యత క్రమంలో ఈ నిధులను ఖర్చు చేయాలని మున్సిపల్ శాఖ మార్గదర్శకాలను రూపొందించింది. మున్సిపాలిటీల్లో విలీనమైన ప్రాంతాల అభివృద్ధి, అంతర్గత రహదారుల నిర్మాణం, వర్షపు నీరు, మురుగు నీటికి డ్రైన్ల నిర్మాణం, జంక్షన్‌ల అభివృద్ధి, చెరువులు, కుంటల్లో కాలుష్య నివారణ, డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించిన ప్రాంతాల్లో ప్రాథమిక సదుపాయాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, కల్వర్టుల నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్సుల నిర్మాణ పనులకు ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అన్ని మున్సిపాలిటీల్లో సంబంధిత విభాగాలు వెంటనే టెండర్లు పిలిచి ఈ పనులు ప్రారంభించాలని తెలిపారు. 2026 మార్చి నాటికి అన్ని పనులను పూర్తి చేయాలని గడువు పెట్టారు.

## హరీశ్ రావు కృషి..

### జోర్డాన్ నుంచి తెలంగాణకు చేరుకున్న వలస కార్మికులు



## తెలంగాణలో ఇంటర్ పరీక్ష తేదీలు ఖరారు



## పవన్ కల్యాణ్‌పై కామెంట్స్ డిప్యూటీ స్పీకర్ ఫిర్యాదు



## పాకిస్తాన్‌కు అదిరిపోయే దెబ్బ కొట్టిన భారత్

### సరిహద్దు వెంబడి త్రిశూల్ విన్యాసాలు



- NOTAM జారీ చేసిన భారత్, పాకిస్తాన్
- ఆపరేషన్ సింధూర్ తర్వాత మరో మహా విన్యాసం
- సర్ క్రీక్ ప్రాంతానికి వ్యూహాత్మక ప్రాధాన్యం
- రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరిక

## డాక్టర్ ఆత్మహత్య కేసులో సంచలన విషయాలు


### ఓ ఎంపీ ఏం చేశాడంటే..!



**న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** మహారాష్ట్రలో ఓ మహిళా వైద్యురాలి (26) ఆత్మహత్య సంచలనంగా మారింది. సతారా జిల్లా ఆస్పత్రిలోనే వైద్యురాలు ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు ముందు నాలుగు పేజీల సూసైడ్ నోట్ రాసిపెట్టింది. ఎస్ఐ గోపాల్ బద్నే తనను శారీరకంగా, మానసికంగా వేధించాడని ఆరోపించింది. ఐదు నెలల్లో పలుమార్లు తనపై అత్యాచారం చేశాడని ఆరోపించింది. అతడి వేధింపుల వల్లే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తెలిపింది. పై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితురాలు వాపోయింది.

ఇక సూసైడ్ నోట్‌లో అనేక సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఓ ఎంపీ, అతడి సహాయకుల నుంచి తీవ్రమైన బెదిరింపులు వచ్చాయని ఆరోపించింది. ఇక వైద్య పరీక్షలకు తీసుకురాకుండానే నిందితులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలంటూ పోలీసులు పదేపదే తనపై ఒత్తిడి తెచ్చారని తెలిపింది. అందుకు నిరాకరించడంతో ఎస్ఐ గోపాల్ బద్నేతో పాటు మరికొందరు పోలీసు అధికారులు తనను వేధింపులకు గురిచేశారని ఆరోపించింది. ఇక ఎస్ఐ గోపాల్ బద్నే తనపై ఐదు నెలలుగా అత్యాచారం చేస్తున్నాడని.. పైగా మానసికంగా, శారీరకంగా హింసించాడని వాపోయింది. ఇంటి యజమాని కుమారుడు ప్రశాంత్ బంకర్‌పై కూడా ఇవే రకమైన ఆరోపణలు వైద్యురాలు చేసింది.

## వీడిన కర్నూలు బస్సు ప్రమాదం మిస్టరీ!



## రాజ్యాంగ సవరణ చేయాల్సిందే



**న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** బీసీల జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాలని, దీనికి అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయంతో మద్దతు తెలపాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న బీసీ ఉద్యమం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. ఇప్పుడు యుద్ధ భూమిలో ఉన్నామని, విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని త్యాగాలకు సిద్ధం కావాలన్నారు.

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి అజయ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బీసీ విద్యార్థుల సదస్సులో ఆయన మాట్లాడారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సరైన వాదనలు వినిపించకపోవడం వల్లే హైకోర్టు స్టే ఇచ్చిందని ఆరోపించారు. ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించడమే శాశ్వత పరిష్కారమని అన్నారు.

## సమ్మె తప్ప వేరే ఆప్షన్ లేదు..

### విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై జి. సాయిబాబా కీలక వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమ్మె తప్ప వేరే ఆప్షన్ లేదని 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి సాయిబాబా అన్నారు. విద్యుత్ ఉద్యోగులు నిత్యం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారని, విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉన్నా యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. దీర్ఘకాలిక సమస్యలైన ఆర్టీజన్ ఉద్యోగులకు పదోన్నతులతో పాటు.. ఆర్టిజన్లు ప్రమాదాల బారిన పడి గాయపడినప్పుడు వారి కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జి సాయిబాబా డిమాండ్ చేశారు. ఆర్టిజన్లకు కనీసం సెలవులు ఇవ్వకుండా పనిచేయిస్తూ వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## కర్నూలు బస్సు ప్రమాదం ఎఫెక్ట్..!

- ట్రావెల్స్ బుకింగ్స్ రద్దు.. ఆర్టీసీకి పెరిగిన గిరాకీ..
- ఫిట్‌నెస్ లేని బస్సులను ఎక్కడికక్కడ నిలిపివేత..
- ముందుగా బుక్ చేసిన టికెట్లు సైతం రద్దు..



# సమ్మె తప్ప వేరే ఆప్షన్ లేదు.. విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై జి. సాయిబాబా కీలక వ్యాఖ్యలు


**న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** శనివారం మింట్ కాంపౌండ్ లోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేమునూరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్మికులు, ఆర్టిజన్లు, అన్ మ్యాన్డ్ కార్మికులు ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్యలను ప్రాంతీయ అధ్యక్ష కార్యదర్శులు సమావేశంలో కేంద్ర కార్యవర్గం దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి కార్యాచరణ చేపడతామని ఈ సందర్భంగా సాయిబాబా తెలిపారు.

పని భారం పెరిగిపోయింది..

ఇప్పటికే దీర్ఘకాలిక సమస్యలపై యాజమాన్యాలకు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయామని, విద్యుత్ శాఖ మంత్రి స్పందించడంతో ట్రాన్స్ కో యాజమాన్యంతో చర్చలు జరిపినట్లు సాయిబాబా తెలిపారు. అయితే అంగీకరించిన సమస్యల పరిష్కారం పై ఉత్తర్వులు మాత్రం వెలువడలేదన్నారు. ఆర్టిజన్ల సమస్యలన్నీ నేటికీ అపరిష్కృతంగానే ఉన్నాయని అన్నారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యల పట్ల ఇప్పటికే చాలాకాలంగా వేచి ఉన్నామని, ఇక ఆగే పరిస్థితి లేదని ఆయన స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేయడం మినహా వేరే మార్గం లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ సిబ్బందికి మోయలేనంత పని భారం పెరిగిపోయిందని, పని భారం తగ్గించేలా వెంటనే ఖాళీగా ఉన్న 3 వేల పోస్టులతో పాటు సుమారు పదివేల అదనపు పోస్టులు భర్తీ చేయాలని ఆయన కోరారు. ఉద్యోగులకు పదోన్నతుల ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని తిరిగి తీసుకురావాలని, అన్ మ్యాన్డ్, స్పాట్ బిల్లింగ్, ఎంఆర్టీ, అవుట్ సోర్సింగ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలన్నారు. 2011 జేఎల్ఎంలకు వారిని రెగ్యులర్ చేసిన తేదీ నుంచి కాకుండా కాంట్రాక్టు జేఎల్ఎంలుగా చేరిన తేదీ నుంచి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదనపు విద్యార్హతలు పొందిన ఉద్యోగులు కార్మికులకు పదోన్నతుల్లో నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్ రద్దు చేయాలన్నారు.

ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల సానుకూలంగా ఉన్నా, యాజమాన్యాలు మాత్రం తమ సమస్యల పరిష్కారం కోసం కనీసం సమీక్ష జరిపేందుకు కూడా సమయం కేటాయించడం లేదని ఆయన మండిపడ్డారు. సమస్యల పరిష్కారంలో ఇదే వైఖరి కొనసాగితే, యూనియన్ కేంద్ర కార్యవర్గ తీర్మానం మేరకు సమ్మె చేసేందుకు వెనకాడేది లేదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు రాజేందర్, అదనపు ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, సలహాదారు ఆర్ జనార్ధన్ రెడ్డి, డిస్కం, ట్రాన్స్ కో, జెన్ కో ప్రాంతీయ అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లో బయటపడ్డ మరో బంగారు గని..
## ఏకంగా 222 టన్నుల పసిడి, ఆ రాష్ట్రంలో మూడోది..!



**న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** దేశంలోనే అత్యంత ఖనిజ సంపద కలిగిన రాష్ట్రాల్లో ఒకటిగా ఉన్న రాజస్థాన్.. ఇప్పుడు బంగారు నిల్వల విషయంలో మరో సంచలనం సృష్టించింది. ఆ రాష్ట్రంలోని గిరిజన ప్రాంతమైన బాన్స్వారా జిల్లా ఇప్పుడు ఏకంగా దేశపు కొత్త బంగారు రాజధానిగా గుర్తింపు పొందేందుకు సిద్ధం అవుతోంది. బాన్స్వారా జిల్లాలోని ఘటోల్ తెహసీల్ – కంకారియా గ్రామం పరిధిలో ఆ రాష్ట్రంలో మూడో భారీ బంగారు నిల్వలు ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. గతంలో గుర్తించిన భుకియా, జగ్‌పురా గనుల తర్వాత ఈ ప్రాంతం మూడో బంగారు గనిగా నిలిచింది.

భూగర్భ శాస్త్రవేత్తల సర్వేల ప్రకారం.. ఈ కొత్త గనిలో సుమారు 3 కిలోమీటర్ల విస్తీర్ణంలో బంగారు ఖనిజ నిల్వలు ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. ఈ కొత్త బంగారు నిల్వల్లో అత్యంత భారీగా పసిడి లభించబోతున్నట్లు భూగర్భ శాఖ ప్రాథమిక అంచనాల చెబుతున్నాయి. 940.26 హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు 113.52 మిలియన్ టన్నుల బంగారు ఖనిజం ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఇక ఈ ఖనిజాన్ని ప్రాసెస్ చేసిన తర్వాత సుమారు 222.39 టన్నుల స్వచ్ఛమైన బంగారు లోహం లభించవచ్చని నిపుణులు చెబుతున్నారు. రాజస్థాన్‌లో ఇప్పటివరకు బయటపడిన అతిపెద్ద బంగారు నిల్వల్లో ఇది ఒకటని పేర్కొంటున్నారు.

కంకారియా–గారా ప్రాంతంలో బంగారంతో పాటు అనేక విలువైన ఖనిజాలు కూడా వెలికితీసే అవకాశం ఉన్నట్లు అక్కడి ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇక అన్ని అనుమతులు వచ్చి.. అక్కడ బంగారం మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభమైతే.. భారతదేశంలో బంగారం తవ్వకాల్లో పాల్గొనే అతి కొద్ది రాష్ట్రాల జాబితాలో రాజస్థాన్ చేరుతుంది. అంతేకాకుండా.. నిపుణుల అంచనా ప్రకారం భవిష్యత్తులో దేశానికి కావాల్సిన మొత్తం బంగారం డిమాండ్‌లో 25 శాతం వరకు బాన్స్వారా జిల్లా నుంచే సరఫరా అవుతుందని చెబుతున్నారు. గతంలో భుకియా–జగ్‌పురా మైనింగ్ బ్లాక్‌లను ప్రభుత్వం వేలం వేసినప్పటికీ.. పనులు దక్కించుకున్న సంస్థ అవసరమైన హామీ మొత్తాన్ని జమ చేయడంలో విఫలం కావడంతో లైసెన్స్ రద్దు చేశారు. ప్రస్తుతం తాజా టెండర్ల ప్రక్రియ పూర్తయింది. నవంబర్ 3వ తేదీన బిడ్లు తెరవనున్నారు. రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధిక రెవెన్యూ వాటాను అందించే సంస్థకు మైనింగ్ లైసెన్స్ మంజూరు చేయనున్నారు. ఈ బంగారు నిల్వలు బయటపడటంతో బాన్స్వారా జిల్లాలో భారీగా ఉపాధి అవకాశాలు సృష్టించడమే కాకుండా, ఎలక్ట్రానిక్స్, బ్యాటరీలు, పెట్రోకెమికల్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి.. రాజస్థాన్‌లో ఒక కీలక పారిశ్రామిక, ఆర్థిక కేంద్రంగా జిల్లాను మారుస్తుందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# పోలీసుల కీలక ప్రకటన..
## వీడిన కర్నూలు బస్సు ప్రమాదం మిస్టరీ!



**న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** కర్నూలు బస్సు ప్రమాదం మిస్టరీ వీడింది. చిన్నటేకూరు దగ్గర జరిగిన బస్సు ప్రమాదంపై పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. బైక్ నడుపుతూ చనిపోయిన శివశంకర్‌తో పాటు ఎర్రిస్వామి అనే వ్యక్తి ఉన్నాడు. చిన్నటేకూరు సమీపంలో శివశంకర్ బైక్ నడుపుతూ స్కిడై డివైడర్‌ను ఢీకొట్టాడు. దాంతో శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందగా.. ఎర్రిస్వామి గాయాలతో బయటపడ్డాడు. అదే సమయంలో బైక్‌ను కావేరి ట్రావెల్స్ బస్సు వచ్చి ఢీ కొట్టి కొద్దిదూరం ఈడ్చుకెళ్లింది. ఆ సమయంలో బస్సు కింద మంటలు వచ్చి అంతా వ్యాపించాయి.

'ఎర్రిస్వామి, శివశంకర్ కలిసి లక్ష్మీపురం నుండి శుక్రవారం తెల్లవారుజాము 2 గంటలకు బయలు దేరారు. ఎర్రిస్వామిని వదలడానికి శివశంకర్ తుగ్గలికి బయలు దేరాడు. దారిలో కియా షోరూం దగ్గర హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో తెల్లవారుజామున 2.24 గంటలకు రూ.300 పెట్రోల్ పోయించుకొని బయలు దేరారు. బయలు దేరిన కొద్దిసేపటికి చిన్నటేకూరు సమీపంలో శివశంకర్ బైక్ నడుపుతూ స్కిడై డివైడర్‌ను ఢీకొట్టాడు. శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎర్రిస్వామి గాయాలతో బయటపడ్డాడు. ప్రమాద స్థలం దగ్గర రోడ్డు మధ్యలో నుండి శివశంకర్‌ను బయటికి లాగి శ్వాస చూడగా.. అతడు చనిపోయాడని ఎర్రిస్వామి నిర్ధారించుకున్నాడు. రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను తీద్దామనుకునే సమయంలోనే కావేరి ట్రావెల్స్ బస్సు దూసుకొచ్చింది. బైక్‌ను బస్సు ఢీకొట్టి కొద్దిదూరం ఈడ్చుకెళ్ళింది. బస్సు క్రింద మంటలు రావడంతో ఎర్రిస్వామి బయపడి అక్కడి నుండి తన స్వంత ఊరు తుగ్గలికి వెళ్ళిపోయాడు. ఉలిందకొండ పీఎస్లో కేసు నమోదు చేస్తున్నాం. ఈఘటనపై దర్యాప్తు చేస్తాం' అని ఎస్పీ విక్రాంత్ పాటిల్ చెప్పారు.

# హరీశ్ రావు కృషి..
## జోర్డాన్ నుంచి తెలంగాణకు చేరుకున్న వలస కార్మికులు

**న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** ఉపాధి నిమిత్తం వివిధ దేశాలకు వెళ్లి అక్కడ ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న మన వారిని కాపాడుకోవడం మన ప్రభుత్వాల బాధ్యత అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. బతుకు తెరువు కోసం, అప్పులు తీర్చడం కోసం జోర్డాన్, ఇజ్రాయిల్, గల్ఫ్ వంటి దేశాలకు వెళ్లి ఏజెంట్ల చేతుల్లో చిక్కుకొని ఎంతో మంది బతుకులు ఆగం అవుతున్నయని, అలాంటి వారిని కాపాడాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దు నిద్ర పోతున్నాయని విమర్శించారు. హరీశ్ రావు కృషితో జోర్డాన్?లో చిక్కుకుపోయిన 12 మంది ఇవాళ హైదరాబాద్ కు చేరుకున్నారు. ఆ తర్వాత వారంతా హరీశ్ రావును మర్యాదపూర్వకంగాకలిశారు. జోర్డాన్ లో అనేక ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కొన్న తమను ఆదుకొని, స్వదేశానికి తిరిగి వచ్చేలా చేశారని బీఆర్ఎస్ పార్టీకి, హరీశ్ రావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన హరీశ్ రావు 12 మంది వలస కార్మికుల సమస్య తెలియగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లామని, జోర్డాన్?లోని ఇండియన్ ఎంబసీ ఆఫీస్?కు అనేక సార్లు మొరపెట్టుకున్నా ఎలాంటి స్పందన రాలేదన్నారు. అందుకే జోర్డాన్ లో చిక్కుకున్న12 మంది కోసం పెనాల్టీ కట్టి తిరిగి స్వదేశానికి తీసుకువచ్చామని హరీశ్ రావు చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దునిద్ర పోతే బీఆర్ఎస్ పార్టీ 12 మంది కార్మికులను కాపాడి స్వదేశానికి తీసుకువచ్చామన్నారు.

### గల్ఫ్ బోర్డు ఏది?:

రేవంత్ రెడ్డి గల్ఫ్ సంక్షేమ బోర్డు పెడతామని వాళ్లకోసం ప్రత్యేక పాలసీ తెచ్చి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని రెండు సంవత్సరాలు అయినా రేవంత్ రెడ్డి నుంచి స్పందన లేదని హరీశ్ రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి ఏ ఒక్కటి కూడా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని దుయ్యబట్టారు. మన రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్.. విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న తెలంగాణ బిడ్డలను తీసుకురావడానికి ప్రత్యేకమైన ఒక విభాగాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు మనకు అధికారం ఇచ్చింది ఆపదలో ఉన్న ప్రజలని ఆదుకోవడానికి, కష్టాల్లో ఉన్నవారిని కాపాడుకోవడానికని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, గెలిచినా తరవాత అమలు చేయడం, ఇచ్చిన ప్రతి మాటను నిలపెట్టుకోవడం మీ బాధ్యత అన్నారు. జోర్డాన్ కార్మికులను వెనక్కి తీసుకువచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయితే ప్రతిపక్ష బీఆర్ఎస్ వారిని స్వదేశానికి తీసుకొచ్చి కార్మికులకు బాసటగా నిలిచిందన్నారు. కాగా ఈ 12 మంది వలస కార్మికుల ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా చెల్లించాల్సిన మొత్తంతో పాటు, స్వదేశానికి రావడానికి అయ్యే విమాన టికెట్లను సైతం స్వయంగా హరీశ్ రావు భరించారు. ఎట్టకేలకు హైదరాబాద్ చేరుకున్న వారిని ప్రత్యేక వాహనాల్లో సొంతుళ్లకు తరలించారు. ప్రస్తుతం వాళ్లు ఇంటికి చేరుకున్నారు.

# తెలంగాణలో ఇంటర్ పరీక్ష తేదీలు ఖరారు

**న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ స్టేట్ ఇంటర్ బోర్డు.. ఇంటర్మీడియట్ పరీక్షల తేదీలను ఖరారు చేసింది. ఈ మేరకు ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫైనల్ పరీక్షల షెడ్యూల్ ను విడుదల చేసింది. 2026 ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి 18వ తేదీ వరకూ ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. నవంబర్ 1 నుంచి విద్యార్థులు పరీక్షల ఫీజు చెల్లించవచ్చునని తెలంగాణ ఇంటర్ బోర్డు సెక్రటర కృష్ణ ఆదిత్య తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటర్ పరీక్షల షెడ్యూల్ కు ఆమోదం తెలిపారని ఆయన వెల్లడించారు.

కాగా.. గతేడాది తెలంగాణలో ఇంటర్ పరీక్షలు మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభమవ్వగా .. ఈ ఏడాది 8 రోజుల ముందుగానే పరీక్షలు నిర్వహించేలా ఇంటర్ బోర్డు షెడ్యూల్ రూపొందించింది. ఈ ఏడాది సుమారు 9.50 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నట్లు తెలుస్తోంది. 12 ఏళ్ల తర్వాత ఈసారి ఇంటర్మీడియట్ సిలబస్ ను కూడా బోర్డు మార్చింది. కాగా.. 8 రోజుల ముందుగానే పరీక్షలు నిర్వహించడం వల్ల జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్, నీట్, ఈఏపీసెట్ ఎంట్రన్స్ టెస్టులకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు మరింత సమయం లభిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

# రాజ్యాంగ సవరణ చేయాల్సిందే

మొదటి పేజీ తరువాయి

బీసీ జేఏసీ రాష్ట్ర బంద్ పూర్తిగా విజయవంతమైందని, ఇది బీసీల చైతన్యానికి ప్రతీక అన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్‌తో ఈ నెల 26న అన్ని జిల్లా, నియోజకవర్గం కేంద్రాలలో బీసీ, కుల, ప్రజా సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. అన్ని మండల కేంద్రాలలో దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 56 శాతానికి పెంచాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు వేముల రామకృష్ణ, జి.అనంతయ్య, సి.రాజేందర్, రిష్విక్, వెంకటేష్, రాజు, శివయాదవ్, వంశీ, వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌కుమార్, వేణుగోపాల్‌బీ భాస్కర్, నరేష్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్‌పై కామెంట్స్..డిప్యూటీ స్పీకర్ ఫిర్యాదు

**న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** కూటమి పక్షాల మధ్య, కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారిపై డీజీపీకి పిర్యాదు చేశారు. అంభోజి వినయ్ కుమార్ పేరుతో ఫేస్‌బుక్‌లో కరుడుగట్టిన వైసీపీ సపోర్టర్ ఫేక్ పోస్టులను పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. దీని వల్ల అధికార కూటమిలో వైషమ్యాలు తీసుకురావడంతో పాటు కులాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ఎన్నడూ చేయని కామెంట్లను చేసినట్టు.. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆరోపించారు. ఈ పోస్టులకు సంభందించి స్క్రీన్ షాట్‌లు, లింకులను కూడా తన ఫిర్యాదులో జత చేసినట్లు తెలిపారు. ఇలాంటి పోస్టులు పెట్టిన వారిపై భారతీయ న్యాయ సంహితలో ఉన్న సెక్షన్‌లను సైతం ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. ఈ అంశంపై తక్షణం విచారణకు ఆదేశించి ఈ ఫేక్ పోస్టుల మూలలను శోదించాలని, భాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కోరారు.

# కర్నూలు బస్సు ప్రమాదం ఎఫెక్ట్..!

**న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదం అంతా ఉలిక్కి పడేలా చేసింది.. ఈ ఘటనతో అసలు ఆర్టీఏ అధికారులు ఏం చేస్తున్నారు..? ప్రయాణికుల రక్షణ కోసం ప్రభుత్వాలు ఏం చర్యలు తీసుకుంటున్నాయే విమర్శలు కూడా వచ్చాయి.. అయితే, ఆర్టీఏ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.. బస్సులకు సంబంధించిన ఫిట్నెస్ సర్టిఫికేట్, ఆర్‌సీ, బీమా, పర్మిట్, పన్ను, డబుల్ డ్రైవర్, ఎస్కార్ట్ ఫైర్ ఎక్స్‌టింజిషర్ తో పాటు ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్ ఇలా.. క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు రవాణా శాఖ అధికారులు.. మరోవైపు, కర్నూలు బస్సు ప్రమాదం తర్వాత ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యాజమానుల్లో కాస్త చలనం వచ్చినట్టుగా కనిపిస్తోంది.. ఫిట్‌నెస్ లేని బస్సులను ఎక్కడికక్కడ నిలిపివేస్తున్నారు ఆయా ట్రావెల్స్ యాజమాన్యాలు.. దీంతో, ముందుగా బుక్ చేసిన టికెట్లను సైతం రద్దు చేస్తున్నారు.

సాధారణంగా వీకెండ్ కావడంతో ప్రైవేట్ ట్రావెల్స్‌లో భారీగా బుకింగ్స్ ఉంటాయి.. వీకెండ్ కోసం ముందే బుక్ చేసుకునేవాళ్లు కూడా ఉంటారు.. అయితే, నిబంధనలు ఉల్లంఘిస్తున్న బస్సులపై ఆర్టీఏ చర్యలు ప్రారంభించింది.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు బెంగళూరులోనూ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల తనిఖీలు, సీజ్‌లు కొనసాగుతున్నాయి.. తెలంగాణలో వారం రోజుల ఆర్టీఏ స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగనున్నాయి.. ఈ నేపథ్యంలో.. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు బుకింగ్స్ రద్దు చేస్తున్నాయి.. ప్రయాణికులకు డబ్బులను రీఫండ్ చేస్తున్నాయి.. దీంతో, ఆర్టీసీ బస్సులకు ఒక్కసారిగా గిరాకీ పెరిగినట్టు అధికారులు చెబుతున్నారు..

# పాకిస్తాన్‌కు అదిరిపోయే దెబ్బ కొట్టిన భారత్

**న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** పాకిస్తాన్‌ను భారత్ మరోసారి అదిరిపోయే దెబ్బ కొట్టింది. ఈ నేపథ్యంలో సరిహద్దుల వెంబడి త్రిశూల్ త్రివిధ దళాల విన్యాసాల నేపథ్యంలో పాకిస్తాన్ తన మధ్య, దక్షిణ వాయు ప్రాంతాల్లో పలు ఎయిర్ ట్రాఫిక్ మార్గాలపై ఆంక్షలు విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 28, 29 తేదీలకు సంబంధించి NOTAM (Notice to Airmen%) జారీ చేసినప్పటికీ, దాని వెనుక కారణాన్ని ఇస్లామాబాద్ ఇప్పటి వరకు వెల్లడించలేదు. ఇక, భారత ప్రభుత్వం ఇప్పటికే అక్టోబర్ 30 నుంచి నవంబర్ 10 వరకు సర్ క్రీక్ సరిహద్దు ప్రాంతంలో భారీ త్రివిధ దళాల విన్యాసాలకు సంబంధించి NOTAM జారీ చేసింది. 'ఆపరేషన్ సింధూర్' తర్వాత ఇలాంటి సరిహద్దు సైనిక విన్యాసాల సమయంలో ఇరు దేశాలు NOTAMలు జారీ చేయడం సాధారణం అయింది.

త్రిశూల్ విన్యాసాల ప్రాముఖ్యత

త్రిశూల్ విన్యాసాల కోసం కేటాయించిన వైమానిక పరిధి 28,000 అడుగుల ఎత్తు వరకు విస్తరించింది. ఇటీవల కాలంలో జరిగిన అత్యంత కీలక సంయుక్త సైనిక విన్యాసాల్లో ఒకటిగా చెప్పాలి. ఇక, రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపిన ప్రకారం, ఈ విన్యాసాల్లో సైన్యం, నౌకాదళం, వాయుసేన మూడు విభాగాలూ పాల్గొననున్నాయి. ఇది సంయుక్త ఆపరేషనల్ సామర్థ్యాలు, ఆత్మనిర్భర్ భారత్ సూత్రం, సాంకేతిక ఆవిష్కరణలను ప్రదర్శించడమే లక్ష్యమని పేర్కొంది. దక్షిణ కమాండ్ దళాలు ఈ విన్యాసాల్లో చురుకుగా పాల్గొంటాయి. క్రీక్ అండ్ ఎడారి ప్రాంతాల్లో దాడి వ్యూహాలు, సౌరాష్ట్ర తీరంలో విన్యాసాలు, బహుముఖ ఆపరేషనల్ వ్యాయామాలు నిర్వహించనున్నట్లు రక్షణ శాఖ వెల్లడించింది.

సర్ క్రీక్ ప్రాంతంలో వ్యూహాత్మక ప్రాధాన్యం..

ఈ విన్యాసాలు పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంలోని సర్ క్రీక్–సింధ్–కరాచీ అక్షం ప్రాంతంలో జరుగుతున్నాయి. దీనిపై ఇటీవల కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సర్ క్రీక్ ప్రాంతంలో పాకిస్తాన్ సైనిక చర్యలపై హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. పాకిస్తాన్ సర్ క్రీక్ ప్రాంతంలో దూకుడుగా వ్యవహరించేందుకు ప్రయత్నిస్తే, భారత సైన్యం ఇచ్చే సమాధానం చరిత్రలో గుర్తుండి పోతుందని వార్నింగ్ ఇచ్చారు. కాగా, పాకిస్తాన్ సర్ క్రీక్ ప్రాంతంలో తన సైనిక మౌలిక సదుపాయాలను వేగంగా విస్తరించడానికి ప్లాన్ చేస్తుందని ఇటీవల ఇంటెలిజెన్స్ నివేదిక పంపించింది.

# డాక్టర్ ఆత్మహత్య కేసులో సంచలన విషయాలు..
## ఓ ఎంపీ ఏం చేశాడంటే..!

**న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** మహారాష్ట్రలో ఓ మహిళా వైద్యురాలి (26) ఆత్మహత్య సంచలనంగా మారింది. సతారా జిల్లా ఆస్పత్రిలోనే వైద్యురాలు ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు ముందు నాలుగు పేజీల సూసైడ్ నోట్ రాసిపెట్టింది. ఎస్ఐ గోపాల్ బద్నే తనను శారీరకంగా, మానసికంగా వేధించాడని ఆరోపించింది. ఐదు నెలల్లో పలుమార్లు తనపై అత్యాచారం చేశాడని ఆరోపించింది. అతడి వేధింపుల వల్లే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తెలిపింది. పై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితురాలు వాపోయింది. ఇక సూసైడ్ నోట్‌లో అనేక సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఓ ఎంపీ, అతడి సహాయకుల నుంచి తీవ్రమైన బెదిరింపులు వచ్చాయని ఆరోపించింది. ఇక వైద్య పరీక్షలకు తీసుకురాకుండానే నిందితులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలంటూ పోలీసులు పదేపదే తనపై ఒత్తిడి తెచ్చారని తెలిపింది. అందుకు నిరాకరించడంతో ఎస్ఐ గోపాల్ బద్నేతో పాటు మరికొందరు పోలీసు అధికారులు తనను వేధింపులకు గురిచేశారని ఆరోపించింది. ఇక ఎస్ఐ గోపాల్ బద్నే తనపై ఐదు నెలలుగా అత్యాచారం చేస్తున్నాడని.. పైగా మానసికంగా, శారీరకంగా హింసించాడని వాపోయింది. ఇంటి యజమాని కుమారుడు ప్రశాంత్ బంకర్‌పై కూడా ఇవే రకమైన ఆరోపణలు వైద్యురాలు చేసింది. సూసైడ్ నోట్ ఆధారంగా ఎస్ఐ గోపాల్ బద్నే, ఇంటి యజమాని కుమారుడు ప్రశాంత్ బంకర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే విచారణలో ఎస్ఐ గోపాల్ బద్నే–వైద్యురాలు బంధువులేనని తేలింది. బంధువు ముసుగులో ఎస్ఐ.. వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడినట్లు గుర్తించారు.


ప్రస్తుతం ఈ వ్యవహారం పొలిటికల్ టర్న్ తీసుకుంది. బీజేపీ కూటమి ప్రభుత్వం నిందితులను కాపాడుతోందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నామ్‌దేవ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో కీలక పోస్టు పెట్టారు. రక్షించాల్సి పోలీసులే.. వైద్యురాలిపై వేధింపులకు పాల్పడటాన్ని తప్పుబట్టారు. తొలుత ఆమె పై అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడే ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం పదేపదే పోలీసులను రక్షిస్తోందని.. అందుకే దురాగతాలు పెరిగిపోయాయని విమర్శించారు. ఆరోపణలను బీజేపీ నాయకురాలు చిత్ర వాఘ్ ఖండించారు. ఇది సంఘటన దురదృష్టకరమని, ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుపుతామని హామీ ఇచ్చారు.

# హిట్ అండ్ రన్ కేసు.. బిగ్‌బాస్ బ్యూటీపై కేసు

**న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** హిట్ అండ్ రన్ కేసులో బిగ్ బాస్ బ్యూటీపై కేసు నమోదైంది.. కన్నడ బిగ్ బాస్ ద్వారా కర్ణాటకలో బాగా ఫేమస్ అయిన నటి దివ్య సురేష్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు పోలీసులు.. బెంగళూరులో యాక్సిడెంట్ చేసి పరారైన దివ్య సురేషపై హిట్ అండ్ రన్ కేసు నమోదు చేశారు బెంగళూరు పోలీసులు.. ఈ నెల 4వ తేదీన అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో బైతరాయణపురలోని ఎంఎం రోడ్డులో ప్రమాదం చోటు చేసుకుంది.. ఓ బైక్?ను ఢీకొట్టిన కారు.. ఆపకుండా అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటనలో బైక్?పై వెళ్తున్న మహిళ తీవ్రగాయాలపాలయ్యారు.. ఆ బైక్‌పై ఉన్న అనూష, కిరణ్‌కు స్వల్పగాయాలు అయ్యాయి..

అయితే, కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా కారు నంబర్‌ను కనుగొని ఆ కారు నటి దివ్య సురేష్?దిగా గుర్తించారు.. దీంతో, దివ్య సురేష్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.. అంతేకాదు, ఆమె కారును కూడా పోలీసులు సీజ్ చేయడం.. మళ్లీ ఆమె తన కారును విడిపించుకున్నట్టుగా తెలుస్తోంది.. ఈ ఘటన సోషల్ మీడియాలో వేదికగా విమర్శలు వస్తున్నాయి.. నటి దివ్య సురేష్‌పై మండిపడుతున్నారు నెటిజన్లు.. అయితే, ఈ కేసులో దివ్య సురేష్‌ను బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు విచారించేందుకు సిద్ధమవుతున్నారు.

# సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించిన చిరంజీవి..
## 30 మందికి నోటీసులు



**న్యూస్ డెస్క్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** అనుమతి లేకుండా ప్రముఖ నటుడు చిరంజీవి పేరు, ఫోటో, వాయిస్, చిత్రాలను వాడకూడదని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది. తన పేరు, ఫోటోలు దుర్వినియోగంపై చిరంజీవి సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు చిరంజీవికి అనుకులంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఏ వ్యక్తి లేదా సంస్థ చిరంజీవి వ్యక్తిత్వ, ప్రచార హక్కులను ఉల్లంఘించే విధంగా ఆయన పేరు, ఫోటోలు, వాయిస్ తదితర గుర్తించదగిన లక్షణాలను అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగించవద్దని హెచ్చరించింది. 'మెగాస్టార్, చిరు, అన్నయ్య' పేర్లతో ఏఐ మార్ఫింగ్ డిజిటల్ వేదికలపై కోర్టు ఆంక్షలు విధించింది. టీఆర్పీ, లాభాల కోసం చిరంజీవి పేరు దుర్వినియోగం చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. చిరంజీవి పేరు, ఫోటోలు దుర్వినియోగం చేసిన 30 మందికి కోర్టు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను అక్టోబర్ 27కి వాయిదా వేసింది. కాగా ఈ నెల 11వ తేదీన చిరంజీవి హైదరాబాద్ సీపీ వి.సి సజ్జనార్ ను కలిశారు. ఈ సందర్భంగా కోర్టు ఉత్తర్వులు ప్రతిని సీపీకి సజ్జనార్ వ్యక్తిగతంగా అందజేశారు. అలాగే ఇటువంటి ఉల్లంఘనలను అరికట్టేందుకు శిక్షా చట్టాలు మరింత కఠినంగా ఉండాల్సిన అవసరంపై ఇరువురు సవివరంగా చర్చించారు.

కాగా ఏఐ ఎఫెక్టుతో కోర్టులను ఆశ్రయిస్తున్న యాక్టర్ సంఖ్య పెరుగుతోంది. గతంలో నాగార్జున ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా ఆయనకు సానుకూలమైన నిర్ణయం వచ్చింది. అదే బాటలో అమితాబచ్చన్, అక్షయ్ కుమార్, అభిషేక్ బచ్చన్, ఐశ్వర్యరాయ్, హృతిక్ రోషన్, కరణ్ జోహార్, ఆశా భోస్లే, రజనీకాంత్ లు తమ వ్యక్తిత్వ హక్కులను కాపాడాలంటూ కోర్టులను ఆశ్రయించారు.

# ఈనెల 27 న పెన్షనర్ల ధర్నా జయప్రదం చేయండి

## పెన్షనర్లకు ఎస్జిపిఏటి పిలుపు



**ఖమ్మం టౌన్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** 2024మార్చి నుండి ఉద్యోగవిరమణ చేసిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు రావలసిన ఉద్యోగ విరమణ బకాయిల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 27 న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే పెన్షనర్ల ధర్నా ను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి)రాష్ట్ర కార్యదర్శి వి. మేరిఏసుపాదం, ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య పెన్షనర్లకు పిలుపిచ్చారు.

శనివారం స్థానిక కృషిభవన్ లో పరిశపుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఎస్జిపిఏటి ముఖ్యకార్యకర్తల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మేరిఏసుపాదం మాట్లాడుతూ ప్రభుత్వం నుండి రావలసిన ఉద్యోగ విరమణ బకాయిలు రాక పలువురు పెన్షనర్లు తనువు చాలించారని, ఇప్పటికైనా పెన్షనర్ల బకాయిలు సత్వరం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

2024మార్చి నుండి పదివేలమంది కి పైగా ఉద్యోగ విరమణ చేసారని, ప్రభుత్వ చర్యలవల్ల పదివేల కుటుంబాలు ఆర్ధిక సమస్యల వలయంలో చిక్కుకున్నారని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉద్యోగవిరమణ బకాయిలు తీసుకోకుండా నలుగురు తనువు చాలించారని ఈ మరణాలకు రాష్ట్ర ప్రభుత్వం భాధ్యత వహించాలని జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య అన్నారు.

భారతదేశ చరిత్రలో పెన్షనర్ల మరణాలతో తెలంగాణ కొత్త చరిత్ర సృష్టించిందని, ఇప్పటికైనా పెన్షనర్ల బకాయిలు సత్వరం చెల్లింపులు చేయటం ద్వారా పెన్షనర్ల మరణాలు నిలువరించాలని పుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

సమావేశంలో జిల్లా కార్యదర్శి రాయలరవికుమార్, ఉపాధ్యక్షులు పెదమళ్ళసత్యనారాయణ, కెశరత్ బాబు, ఊడుగువెంకటేశ్వర్లు, జల్లా వెంకటేశ్వర్లు, మహిళా కార్యదర్శులు బికృష్ణకుమారి,తాడిఅంజలి, కొట్టెఅన్నమ్మ, జిల్లాకార్యదర్శులురాధాకృష్ణమూర్తి, ప్రసాదరావు, మధుకర్ రెడ్డి, నాగప్రసాద్, కృష్ణారావు, సుధాకర్, ఆళ్ళరామారావు, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ నాయిబ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా కమిటీ ఎన్నిక



**ఖమ్మం టౌన్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ నాయిబ్రాహ్మణ సంఘం ఐక్యవేదిక ఖమ్మం జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులను రాష్ట్ర కమిటి శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సందర్భంగా ఖమ్మంజిల్లా అధ్యక్షులుగా ఖమ్మం పట్టణానికి చెందిన నంద్యాల నరసింహరావు, కార్యదర్శిగా రావులపాటి శ్రీనివాస్ రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నరసింహరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జిల్లాలో నాయిబ్రాహ్మణుల సమస్యల పరిష్కారంకోసం ఆహర్నిషలు కృషి చేస్తామని తెలిపారు. అదే విధంగా ఇతర కార్యవర్గాన్ని త్వరలో ఎన్ను కోవడం జరుగు తుందని తెలిపారు. త్వరలోనే జిల్లాలో జిల్లా మహసభ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను నాయిబ్రాహ్మణ సంఘం సభ్యులు అభినందించారు.

# చింతకాని మండలంలో ఘనంగా కమలన్న బర్త్ డే రక్తదాన శిబిరం ఏర్పాటు



**చింతకాని, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** మధిర నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు 55 పుట్టినరోజు సందర్భంగా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మధిర నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ లింగాల కమల్ రాజు గారి 55వ పుట్టినరోజు సందర్భంగా చింతకాని మండల పార్టీ, యువజన విభాగం ఆధ్వర్యంలో నాగులవంచ గ్రామంలో ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా యువకులు అధిక సంఖ్యలో పాల్గొని 55 మంది రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, రైతు నాయకులు మంకెన రమేష్, గడ్డం శ్రీను, కొండలు, కొల్లి బాబు, ఛాట్ల సురేష్, చాట్ల భగవాన్, యువజన విభాగం నాయకులు కొపూరి నవీన్, అయ్యోరీ సాయి,మీరా సాహెబ్, పర్శగని ఏడుకొండలు,నాదెండ్ల వెంకటేష్, శీలం నాగేశ్వరావు తదితర చింతకాని మండల బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరైనారు.

# పేదల సొంతింటి కల నిజం చేసిన ఇందిరమ్మ సర్కారు

- జిల్లా కాంగ్రెస్ అగ్ర నేతలకు కృతజ్ఞతలు
- మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు వడ్డెబోయిన, నాగండ్ల



**ఖమ్మం బ్యూరో, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** పేదల సొంతింటి కల నిజం చేసేందుకు గాను ఇందిరమ్మ ప్రభుత్వం తాజాగా గృహ నిర్మాణంలో మార్పులు చేయడం ఫలితంగా ఇందిరమ్మ గృహ నిర్మాణం పథకంలో అత్యంత పేదలకు కూడా సొంతిల్లు నిర్మించుకునేలా వెసులుబాటు కలిగించిన రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు ఖమ్మం జిల్లా ముగ్గురు మంత్రులకు ఎంపీలకు ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ నేతలు వద్దేపల్లి నరసింహారావు నాగన్న దీపక్ చౌదరి తమ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో పత్రికా సమావేశంలో నగర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి రాష్ట్ర ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ వద్దేబోయిన నరసింహారావులు మాట్లాడుతూ... ఇటీవల కాలంలో ఖమ్మం నగరంలోని ఇందిరమ్మ ఇళ్ల విషయంపై వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు గారి తనయుడుకు కొన్ని సమస్యలను వివరించడం జరిగింది ప్రధాన సమస్య రాష్ట్ర ప్రభుత్వం 400 చ,, మీ,, ల పైన 600 చ,, మీ,, ల లోపల ఇందిరమ్మ ఇంటిని నిర్మాణం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం మనందరికీ తెలిసిందే అట్టి విషయమై ఖమ్మం నగరంలో ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వ నిబంధన అడ్డురావడంతో కొంతమంది నిరుపేదలు స్థలం సరిపోని నిరుపేదలు ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవడానికి సమస్యగా మారింది అట్టి సమస్యని తుమ్మల యుగంధర్ తో చెప్పడంతో మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు శ్రీనివాస్ రెడ్డికి తెలియపరచి ఖమ్మం నగరంలో జి ప్లస్ వన్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అనుమతించినందుకు వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియ జేస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు కార్పొరేటర్లు మలీదు వేంకటేశ్వరరావు, లకావత్ సైదులు నాయక్ రాపర్తి శరత్, గజ్జల లక్ష్మీ వెంకన్న పాల్గొన్నారు.



# 27 న కాన్సర్ ఉచిత వైద్య శిబిరం

## అభినవ్ హై స్కూల్ అధినేత పి రమణ



**ఖమ్మం బ్యూరో, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** ఈనెల 27 సోమవారం ప్రముఖ విద్యాసంస్థ అభినవ్ హై స్కూల్ఆధ్వర్యంలో కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ హైదరాబాద్ మరియు ఎన్ ఆర్ ఐ పేరెంట్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా కమిటీ సంయుక్త సౌజన్యంతో ఖమ్మం త్రీ టౌన్ పంపింగ్ వెల్ రోడ్ అభినవ్ హై స్కూల్ ఆవరణలో జరిగే ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అభినవ్ హై స్కూల్ అధినేత పి రమణ, కరస్పాండెంట్ పారుపల్లి అరుణ కుమారి కోరారు. వారు ఒక పత్రికా ప్రకటనలో వివరాలు తెలిపారు. వైద్య శిబిరంలో నోటి క్యాన్సర్ కోసం ఓరల్ టెస్ట్, రొమ్ము కాన్సర్ టెస్ట్, క్యాన్సర్ రిస్క్ అసెస్మెంట్ స్కానింగ్, పాప్ స్మియర్ టెస్ట్, గర్భాశయ స్కానింగ్, ఊపిరితిత్తుల ఎక్సరే తదితర క్యాన్సర్ టెస్ట్ లు ఉచితంగా చేస్తారు అని తెలిపారు. హైదరాబాద్ నుంచి ప్రముఖ డాక్టర్లు హాజరు అయి అవసరమైన వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వైద్య శిబిరం నడుస్తుంది అని తెలిపారు. నగర ప్రముఖులు గూడూరు సత్యనారాయణ, డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, కానూరి హిమబిందు తదితరులు పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9949979779 - 7013967208 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# 'సర్వజ్ఞ'లో ఘనంగా పోషకాహార దినోత్సవం



**వనం నాగయ్య, కెరటం న్యూస్ ప్రతినిధి:** నగరంలోని వీడీఓస్ కాలనీ నందు గల సర్వజ్ఞ పాఠశాలలో శనివారం నాడు పోషకాహార దినోత్సవ వేడుకలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. పౌష్టికాహారం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రీ-ప్రైమరీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు వివిధ రకాల పోషక విలువలున్న ఆహార పదార్థాలు, పండ్లు, కూరగాయలను ప్రదర్శిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులను అభినందించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ గారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు పోషకాహారాల యొక్క ప్రాముఖ్యత, విశిష్టత గురించి వివరించారు. ముఖ్యంగా, చిన్నారులు ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలియజేశారు. మంచి పోషకాహారం అనేది శరీరానికి ఇంధనం లాంటిదిబీ జంక్ ఫుడ్కు దూరంగా ఉంటేనే మన ఆరోగ్యం, తెలివితేటలు వృద్ధి చెందుతాయి" అని ఉద్ఘాటించారు. "పిల్లల సరైన ఎదుగుదలకు, భవిష్యత్తులో వ్యాధులను ఎదుర్కోవడానికి బలం ఇచ్చేది కేవలం సమతుల్య ఆహారం మాత్రమే" అని తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల ప్రదర్శనను మెచ్చుకున్నారు మరియు వారి ప్రయత్నాలను అభినందించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని వారు తెలిపారు.

# భారీ వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం

## భారీ వర్షాలతో దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన

## బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి



**వనం నాగయ్య, జక్కేపల్లి, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** పేరిక సింగారం తదితర రెవెన్యూ పరిధిలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు దెబ్బతిన్న పంట పొలాల ను పార్టీ మండల కిసాన్ మోర్చ అధ్యక్షులు కొత్త శ్రీనివాస్ రెడ్డి మరియు బద్దం వెంకట రెడ్డి తో కలిసి పరిశీలించడం జరిగినది. కూసుమంచి మండలం లో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కు కూసుమంచి మండల పరిధిలోని రైతులు కోలుకొని విధంగా నష్టపోయారు. పత్తి పంట, మిర్చి పంటలతో పాటు చేతికి వచ్చిన వరి పంట నేలమట్టం కావడంతో పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. మరీ ముఖ్యంగా శు క్రవారం రోజున కురిసిన వర్షానికి వరి పంట మొత్తం నేలమట్టం కావడంతో రైజులు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. కౌలు రైతులు ఎకరాకు నలభై వేల రూపాయలు చెల్లించి, యాభై వేల రూపాయలు పైచిలుకు పెట్టుబడి పెట్టడం వలన వారు తీవ్రంగా నష్టపోయి అప్పులు ఊబిలోకి నెట్టబడుతున్నారు స్థానిక మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు తక్షణమే స్పందించి సంబధిత అధికారుల తో పంట నష్టం సర్వే చేయాలని, ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపోయిన పంటకు ఎకరాకు యాభై వేల రూపాయలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాము. వ్యవసాయ అధికారిని రామడుగు వాణి గారికి ఫోన్ లో విషయము తెలపగా, వెంటనే స్పందించి భారీ వర్షాలతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించడం జరిగినది. ఏవో రామడుగు వాణి గారు మాట్లాడుతూ దెబ్బతిన్న పంట పొలాలను మరొకసారి ఉన్నత అధికారులతో కలిసి పర్యటించి నివేదిక అందిస్తామని హామీ ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా తక్షణమే స్పందించిన వ్యవసాయ అధికారిని రామడుగు వాణి గారికి భారతీయ జనతా పార్టీ తరపున మరియు రైతుల తరపున ధన్యవాదాలు తెలియజేయడం జరిగినది పంట నష్ట పోయిన రైతులు బద్దం వెంకట రెడ్డి, అజ్మీరా మల్సూరు, రామిని శ్రీనివాస్ రెడ్డి, కొత్త రజనీకాంత్ రెడ్డి, బానోత్ నాగేశ్వర్ రావు తదితర రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించడం జరిగినది.

# వెయ్యి రూపాయల కోసం స్నేహితుడి దారుణ హత్య



**రాజేంద్రనగర్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్):** వెయ్యి రూపాయల కోసం తలెత్తిన గొడవ ఓ యువకుడి ప్రాణం తీసింది. ఈ ఘటన మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వట్టేపల్లిలో నివాసం ఉండే సయ్యద్ అఫ్రోజ్(21) ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. గతంలో అఫ్రోజ్ అబ్బు వద్ద తీసుకున్న వెయ్యి రూపాయల విషయంలో రెండు రోజుల క్రితం గొడవ జరిగింది. దీంతో అబ్బు అఫ్రోజ్ పై కోపం పెంచుకుని అఫ్రోజ్ ను హత్య చేయాలని తన మిత్రులు సోహెల్, రిజ్వాన్ లతో ప్లాన్ వేశాడు. అబ్బు తన మిత్రులతో కలిసి మధ్యరాత్రి అఫ్రోజ్ ఇంటికి వెళ్లి మాట్లాడేందుకు బయటికి పిలిచి కత్తులతో దాడి చేశారు. దాడిలో అఫ్రోజ్ కు తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. అఫ్రోజ్ మృతి చెందాడని నిర్ధారించుకున్న నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. అఫ్రోజ్ భార్య షబానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రెండు కత్తులు స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

# ప్రపంచవ్యాప్తంగా క్రికెట్‌కు ఇంత ఆదరణ రావడానికి కారణం భారత్..



స్పోర్ట్స్ న్యూస్ , 25 అక్టోబర్ (కెరటం న్యూస్): క్రికెట్‌ను ఇష్టపడే ఫ్యాన్స్ సంఖ్య విపరీతంగా పెరిగిపోతుంది. దానిని ఆదాయ వనరులుగా భారీ స్థాయిలో తీర్చిదిద్దడం వెనుక భారత జట్టుది కీలక పాత్ర పోషించిందని ఆస్ట్రేలియా మాజీ పేసర్ బ్రెట్‌లీ పేర్కొన్నారు. టీమిండియా క్రికెట్ వాణిజ్య కేంద్రంగా మారడమే కాదు, ఆట పట్ల అసమానమైన అంకిత భావాన్ని కూడా సంపాదించుకుందన్నాడు. ఓ స్పోర్ట్స్ ఛానల్‌తో బ్రెట్ లీ మాట్లాడుతూ.. తన వాదనకు బలం చేకూరేలా ఆసక్తికర కామెంట్స్ చేశాడు. భారత్‌తో పోలిస్తే ఆస్ట్రేలియాలో పరిమితులు ఉంటాయని తెలిపాడు.

అయితే, ఆస్ట్రేలియాలో ఎంత ప్రచారం చేసినా భారీ స్థాయిలో క్రికెట్‌కు ఫ్యాన్స్ ఉండరని బ్రెట్‌లీ చెప్పుకొచ్చారు. ఇక భారత్‌లో అయితే ఆ సంఖ్య కోట్లలో ఉందన్నారు. 150 కోట్ల మంది భారతీయుల్లో క్రికెట్ ఇష్టపడని వ్యక్తులను నేను ఓ 10 మందిని కలిసి ఉంటాను.. ఇప్పుడు టీ20లను వీక్షించే వారి సంఖ్య కూడా చాలా వరకు పెరిగిపోయింది. పేరెంట్స్ ధోరణి కాస్త స్లోగా ఉంటే.. పిల్లలు మాత్రం త్వరగా విషయాలు జరిగిపోవాలని కోరుకుంటున్నారు. అందుకే, టీ20 ఫార్మాట్‌కు ఇంత ఆదరణ పెరిగిందని ఈ మాజీ పేసర్ పేర్కొన్నాడు. బ్రెజిల్ లాంటి దేశాల్లో ఫుట్‌బాల్ ఆటకు ముగింపు పలికే రోజు వస్తుందేమో కానీ.. భారత్‌లో క్రికెట్‌కు ఆ పరిస్థితి ఏ రోజు రాదు.. భారతీయుల వల్లే ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ కొనసాగుతుంది.. అక్కడి అభిమానులకు ఉన్న ఇంట్రెస్ట్ తోనే ఇది సాధ్యమైందని బ్రెట్‌లీ వ్యాఖ్యానించాడు.

# ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్లకు వేధింపులు.. ఇండోర్ వ్యక్తి అరెస్టు



స్పోర్ట్స్ న్యూస్ , 25 అక్టోబర్ (కెరటం న్యూస్): ఇండోర్: ఐసీసీ మహిళా ప్రపంప కప్‌లో ఆడుతున్న ఇద్దరు ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్ల ను వేధించిన కేసులో ఇండోర్‌లోని ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. బస చేస్తున్న రాడిసన్ హోటల్ నుంచి కేఫ్‌కు నడచుకుంటూ వెళ్తున్న సమయంలో ఆ క్రికెటర్లను నిందితుడు అసభ్యంగా తాకినట్లు తెలిసింది. ఆస్ట్రేలియా టీమ్ మేనేజర్ డాన్నీ సిమ్మన్స్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని అకీల్‌గా గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఈ ఘటన జరగ్గా.. శుక్రవారం నిందితుడిని పట్టుకున్నారు.

ఇండోర్‌లోని ఖజరానా రోడ్డు మార్గంలో ఈ ఘటన జరిగింది. హోటల్ రూం నుంచి కేఫ్ దిశగా ఇద్దరు మహిళా క్రికెటర్లు నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో.. బైక్‌పై వచ్చిన అకీల్ వాళ్లను వెంబడించాడు. అసభ్యకరంగా ఆ క్రికెటర్లను తాకి అక్కడ నుంచి పరారీ అయ్యాడని ఎస్ఐ నిధి రఘువంశీ తెలిపారు. ఏసీసీ హిమాని మిశ్రా ఆ ఇద్దరు క్రికెటర్లును కలిశారు. వారి నుంచి స్టేట్మెంట్ తీసుకున్నారు.

భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 74, 78 కింద ఎంఐజీ పోలీసు స్టేషన్‌లో కేసు బుక్ చేశారు. బైక్ నెంబర్‌ను ఓ స్థానికుడు గుర్తించాడు. దాని ఆధారంగా అకీల్ ఖాన్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు చెప్పారు.

# గురూజీ..... వెంకీ మామతో ఏం ప్లాన్ చేస్తున్నావయ్యా ?



మూవీ న్యూస్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్): వెంకటేష్ హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఒక సినిమా అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. హారిక హాసిని సంస్థతో పాటు త్రివిక్రమ్ కు చెందిన ఫార్చున్ ఫోర్ సినిమాస్ సంస్థ నిర్మించబోతున్న ఈ సినిమా గురించి ఆసక్తికరమైన ప్రచారం తెరమీదకు వచ్చింది. వాస్తవానికి ఈ సినిమాకి సంబంధించి ఇప్పటివరకు షూట్ మొదలు కాలేదు. ప్రస్తుతానికి విక్టరీ వెంకటేష్, మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న 'మన శంకర్ వరప్రసాద్ గారు' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు.

అయితే, త్రివిక్రమ్ సినిమాలో వెంకటేష్ ఒక సెక్యూరిటీ గార్డ్ పాత్రలో నటించబోతున్నట్లుగా తెలుస్తోంది. ఫ్యామిలీ ఎమోషన్స్ చుట్టూ త్రివిక్రమ్ రాసుకున్న ఈ సినిమా వెంకటేష్ కెరీర్‌లోనే ఒక భిన్నమైన సినిమాగా నిలిచే అవకాశం ఉందని అంటున్నారు. ఒక స్టార్ హీరోని సెక్యూరిటీ గార్డ్ లాంటి పాత్రలో చూపించడం కేవలం గట్స్ ఉన్న దర్శకులకు మాత్రమే చెల్లుతుందని, త్రివిక్రమ్ ఈ సినిమాతో అసలు ఏం చేయబోతున్నాడో అనే చర్చ ఇప్పుడు తెరమీదకు వచ్చింది. ఇక ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయం మీద ఆమె కూడా సానుకూలంగానే స్పందిస్తూ ఉండటంతో దాదాపుగా ఆమె నటించడం ఖరారైపోయినట్లే.

# మాస్ జాతర ట్రైలర్ రిలీజ్ డేట్ ఫిక్స్

## -రవితేజ మాస్ ఎంట్రీకి రెడీ!



మూవీ న్యూస్, 25 అక్టోబర్ (కెరటం న్యూస్): మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర' విడుదలకు సిద్ధమవుతోంది. టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌస్ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌ను దర్శకుడు భాను భోగవరపు తెరకెక్కిస్తున్నారు. రవితేజ సరసన గ్లామరస్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా, ఇప్పటికే రిలీజ్ చేసిన పోస్టర్లు, టీజర్ సినిమాపై భారీ అంచనాలు క్రియేట్ చేశాయి. తాజాగా మాస్ జాతర నుంచి కీలక అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమా ట్రైలర్‌ను అక్టోబర్ 27న (సోమవారం) విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో రవితేజ అభిమానులు ట్రైలర్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడటంతో ప్రమోషన్లు వేగంగా జోరందుకున్నాయి.

ఇక 'మాస్ జాతర' లో రవితేజ ఒక రైల్వే పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నారు. భానుభోగవరపు రైటింగ్ స్టైల్‌కి అనుగుణంగా మాస్, ఎమోషన్, కామెడీ అన్నీ కలగలిపిన పకడ్బందీ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కుతోంది. భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, పంచ్ డైలాగులు, రవితేజ ఎనర్జీ %-% ఇవన్నీ కలగలిపి సినిమాను మాస్ ఫెస్టివల్‌గా మార్చేలా ఉన్నాయని చిత్ర బృందం చెబుతోంది. ఇక 'మాస్ జాతర' అక్టోబర్ 31న గ్రాండ్‌గా విడుదల కానుంది. ట్రైలర్ రిలీజ్‌తో సినిమాపై హైప్ మరింత పెరగడం ఖాయం. రవితేజ కెరీర్‌లో మరో పకా మాస్ హిట్‌గా ఈ సినిమా నిలుస్తుందేమో చూడాలి.









# లింగాల కమల్‌రాజుకు పుట్టిన రోజు ఆశీస్సులు

వనం నాగయ్య, కెరటం న్యూస్ ప్రత్యేకం

ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ లింగాల కమల్‌రాజు పుట్టిన రోజు వేడుకలు మధిర నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. ముఖ్యంగా మధిర, చింతకాని, బోనకల్, ఎర్రుపాలెం, ముదిగొండ మండల కేంద్రాల్లో కమలన్న పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. చింతకాని మండలంలోని నాగులవంచ గ్రామంలో బీఆర్ఎస్ యూత్, చింతకాని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కమల్‌రాజు పుట్టిన రోజు వేడుకలు భారీ ఎత్తున నిర్వహించారు. ఉదయం నాగులవంచ గ్రామంలో రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యూత్ పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.


## పేదల పక్షపాతి కమలన్న..బీఆర్ఎస్ నేతలు

ఉదయం నాగులవంచ గ్రామంలో రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన బీఆర్ఎస్ నేతలు మంకెన రమేష్, గురిజాల హనుమంతరావు, బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, యూత్ నాయకులు కొపూరి నవీన్ తదితరులు మాట్లాడుతూ...లింగాల కమల్‌రాజు పేద ప్రజల పక్షపాతిగా పనిచేస్తున్నారని అన్నారు. కేసీఆర్ ఆడుగుజాడల్లో నడుస్తూ..పార్టీ నిర్ణయాలే శిరోధార్యంగా నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేస్తున్నారని అన్నారు. చింతకాని మండలంలో దళితబంధు పథకం అమలు చేయడంలో ప్రధాన పాత్ర పోషించి వేలాది మంది దళితుల కుటుంబాల్లో వెలుగులు నింపారని గుర్తు చేశారు. చింతకాని మండలంలో దళితులు ఆత్మగౌరవంతో బతుకుతున్నారంటే అది ఒక్క కేసీఆర్ అమలు చేసిన ప్రతిష్టాత్మకమైన దళితబంధు పథకం ద్వారా మాత్రమేనని వారు అన్నారు. అంతటి బృహత్తర పథకాన్ని మండలానికి రావడంలో లింగాల కమల్‌రాజు చొరవ ప్రత్యేకమని వారు అన్నారు. వందల ఏండ్లుగా వెలివాడల్లో బతికిన దళితులు నేడు సొంత కార్లు, ట్రాక్టర్లు, ఇతరత్రా లక్షలాది విలువ చేసే సొంత వాహనాల్లో తిరుగుతూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. లింగాల కమల్‌రాజు పుట్టిన రోజు సందర్భంగా ఇంత మంది యూత్ తరలివచ్చి రక్తదానం చేయడం వెనుక లింగాల కమల్‌రాజుపై ఉన్న గౌరవాన్ని చాటుకుంటోందన్నారు. రాబోవు రోజుల్లో కమలన్న మరిన్ని సేవలు అందించి మధిర నియోజకవర్గ ప్రజలకు అండగా నిలవాలని, నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు.

## కమలన్నకు బీఆర్ఎస్ నేతల ఆశీస్సులు..

మధిర నియోజకవర్గ ఇంచార్జ్, ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు తన పుట్టిన రోజు సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, తదితర ముఖ్యనేతలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు కమల్‌రాజుకు స్వీటు, కేక్ తినిపించి, ఆశీస్సులు అందించారు.

## చింతకాని మండలంలో ఘనంగా కమల్‌రాజు బర్త్ డే, రక్తదాన శిబిరం..



మధిర నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు 55 పుట్టినరోజు సందర్భంగా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మధిర నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు గారి 55వ పుట్టినరోజు సందర్భంగా చింతకాని మండల పార్టీ, యువజన విభాగం ఆధ్వర్యంలో నాగులవంచ గ్రామంలో ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా యువకులు అధిక సంఖ్యలో పాల్గొని 55 మంది రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, రైతు నాయకులు మంకెన రమేష్, గడ్డం శ్రీను, కొండలు, కొల్లి బాబు, ఛాట్ల సురేష్, చాట్ల భగవాన్, యువజన విభాగం నాయకులు కొపూరి నవీన్, అయ్యోరీ సాయి, మీరా సాహెబ్, పర్శగని ఏడుకొండలు, నాదెండ్ల వెంకటేష్, శీలం నాగేశ్వరావు తదితర చింతకాని మండల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరైనారు.